క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

వినుకొండ (నూజెండ్ల): విజిలెన్స్ అధికారుల దాడులలో భాగంగా తలార్లపల్లి గ్రామంలో బుధవారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని ములకలూరు, చెన్నారెడ్డి కాలనీ, వినుకొండ మండలంలోని గోనుగుంట్లవారిపాలెం నుంచి 63.50 క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్న రెండు ఆటోలను, డ్రైవర్లు కె. నాగరాజు, జాన్‌మౌని, ఏజెంట్లు మురళీకృష్ణ, వెంకయ్యలను అదుపులోకి తీసుకొని, ఐనవోలు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈపూరులో ఉప ఎన్నికలు

ఈపూరు: మండలంలోని బొమ్మరాజుపల్లి పంచాయతీ పరిధిలో 1, 7 వార్డులకు, ఉప్పరపాలెం పంచాయతీలో 8వ వార్డుకు ఉపఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రంగనాయకులు తెలిపారు. ఈ నెల 10వ తేదీతో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తవుతుందని, 11న పరిశీలన, తిరస్కరించిన నామినేషన్ల పై ఆర్డీవో అప్పీల్ కోసం 12 చివరి తేదీ అన్నారు. 13న అప్పీల్ పరిష్కారం, 14న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. 14 సాయంత్రం అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామన్నారు. అవసరమైన చోట 19వ తేదీ ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు జరుగుతాయని, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని ఎంపీడీవో పేర్కొన్నారు.

నీటి సమస్య పరిష్కరిస్తాం

బొల్లాపల్లి: మండలంలోని గండిగనుమల, షోలాయపాలెం గ్రామాలను గ్రామీణ నీటిసరఫరా విభాగం ఈఈ ఆర్ఎస్ఆర్ సురేష్ సందర్శించా రు. ఆయా గ్రామాల్లో నీటి సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

17లోగా సర్వే పూర్తి చేయాలి

నాదెండ్ల: ఎన్నికలకు సంబంధించి బీఎల్‌వోలు ఈ నెల 17లోపు డోర్ టు డోర్ సర్వే పూర్తి చేయాలని తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. జేసీ ఆదేశాల మేరకు కొత్త ఓటర్ల నమోదు, సవరణ లు, తొలగింపులు ప్రక్రియను ఆయా బూత్ పరిధి ల్లో పనిచేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

14 వరకు రైల్వే గేట్ల మూసివేత

నాదెండ్ల: సాతులూరు నుంచి కనపర్రు వెళ్లే, సాతులూరు నుంచి బుక్కాపురం వెళ్లే డొంక రోడ్లలో ఉన్న రైల్వే గేట్లను ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకూ మూసివేస్తున్నట్లు తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. ఈమేరకు రైల్వే అధికారుల నుంచి బుధవారం తమకు ఆదేశాలు అందాయని తెలిపారు. గుంటూరు-గుంతకల్లు డబుల్ లైన్ నిర్మాణ పనులు, మరమ్మతుల దృష్ట్యా రెండు రైల్వే గేట్లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు తెలిపారు. సాతులూరు నుంచి చందవరం వెళ్లే రైల్వే గేటు యథావిధిగా పనిచేస్తుందని తెలిపారు.

ఓటర్ల సర్వే పర్యవేక్షణ

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు సచివాలయ పరిధిలో బూత్‌లెవల్ అధికారులతో కలిసి బుధవారం ఇన్‌చార్జి తహసీల్దార్ వి. సుధాకర్ శర్మ ఇంటింటికీ తిరిగి పర్యవేక్షించారు. ఓటర్ల సర్వేపై బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ఈ డోర్ టు డోర్ సర్వేలో డబల్ ఓట్లు గుర్తించడం, బోగస్, చనిపోయిన ఓట్లను గుర్తించడం, ఒకే డోర్ నెంబర్‌లో పది మందికి పైగా ఉన్నటువంటి ఇళ్లను గుర్తించడం తదితర సర్వే వివరాలు పూర్తి స్థాయిలో అందజేయాలన్నారు.

వృద్ధుడి ఆచూకీ లభ్యం

నాదెండ్ల: ఈ నెల 1వ తేదీన తప్పిపోయిన సాతులూరు గ్రామానికి చెందిన వృద్ధుడు బాపయ్య చౌదరి ఆచూకీ గుర్తించిన పోలీసులు అతన్ని క్షేమంగా ఇంటికి చేర్చారు. 9వ తేదీన సాతులూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ట్రైన్‌లో హైదరాబాద్ వెళ్తుండగా, నడికుడి రైల్వేస్టేషను వద్ద సిమెంటు బల్లపై బాపయ్య చౌదరి కూర్చుని ఉండటం గమనించి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారమిచ్చాడు. పోలీసుల సాయంతో నడికుడి వెళ్లి వృద్ధుడిని సాతులూరుకు చేర్చారు. కొంతకాలంగా బాపయ్య చౌదరికి మతిస్థిమితం సరిగ్గా లేనట్లు పోలీసులు వెల్లడించారు.

నెలాఖారులోగా పూర్తి చేయాలి

శావల్యాపురం: నాడు-నేడు మన బడి పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు పారదర్శకంగా జరిగేలా క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలని జిల్లా సర్వశిక్షా అభియాన్ ఈఈ (ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు) కె.వి.నాగజ్యోతి అన్నా రు. బుధవారం మండలంలోని పోట్లూ రు, శావల్యాపురం గ్రామాల్లో జరుగుతున్న పనుల పురోగతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ జిల్లాలో నాడు-నేడు పను ల్లో భాగంగా 905 పనులు చేపట్టగా, ఇందుకుగాను రూ. 308 కోట్లు నిధులు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇప్పటి వరకు రూ.126 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసింద న్నారు. అలాగే 173 స్కూల్స్‌లో అదనపు తరగతి గదులు మంజూరు చేసినట్లు చెప్పారు.




కల సాకారం

నాబార్డు నిధులు రూ. 6 కోట్లతో పసుమర్రులో నిర్మితమైన రక్షిత మంచినీటి పథకాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విద్యుత్ మోటారు స్విచ్ ఆన్ చేసి కుళాయిల ద్వారా వస్తున్న మంచినీటిని బిందెలతో పట్టి పలువురు మహిళలకు స్వయంగా అందజేశారు. ఇన్నాళ్లకు తమ కల సాకారమైనందుకు పలువురు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

–చిలకలూరిపేట

చంద్రబాబు, లోకేశ్‌లవి స్వార్థ రాజకీయాలు

- యువత బలి కావద్దంటూ ఎమ్మెల్యే బొల్లా పిలుపు
- ప్రభుత్వ, శ్మశాన భూములను ఆక్రమించడంలో మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దిట్ట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): నారా లోకేశ్, చంద్రబాబు స్వార్థ రాజకీయాలకు చదువుకునే యువకులు బలి కావద్దని, వారి మాటలు నమ్మితే టీడీపీకి బానిసల్లా బతకాల్సి వస్తుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ రూ.2400 కోట్లతో వినుకొండను అభివృద్ధి చేశామన్న లోకేశ్‌కి గట్టి కౌంటర్ ఇచ్చారు. రూ.2400 కోట్లలో మీ వాటా ఎంతని ప్రశ్నించారు. మేము వేసిన రోడ్లపై మీరు తిరుగుతున్నారంటూ చేస్తున్న వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రోడ్లు వేస్తారని, అంతమాత్రాన మేము వేసిన రోడ్లపై తిరుగుతున్నారని అనడాన్ని తప్పుపట్టారు. వందల కోట్లు ప్రభుత్వ ధనాన్ని కాజేసి సీసీ రోడ్ల పేరుతో మట్టి రోడ్ల కన్నా దారుణంగా రోడ్లు వేశారన్నారు.

ప్రభుత్వ భూములను కాజేసిన మాజీ ఎమ్మెల్యే జీవీ...

మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు రైతుల పంట కాలువను ఆక్రమించి గెస్ట్‌హౌస్‌ను నిర్మించుకోవడమే కాకుండా తన గెస్ట్‌హౌస్‌ను పడగొడుతున్నారంటూ ముందుగానే కోర్టుకు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. తన గెస్ట్ హౌస్‌లో ప్రభుత్వ భూమి ఉంటే తీసుకోవచ్చని చెబుతూనే కోర్టును ఆశ్రయించడం దేనికి సంకేతమన్నారు. తన స్వగ్రామమైన ఇనిమెళ్లలో 5 ఎకరాల శ్మశాన భూమిని ఆక్రమించిన జీవీ కేవలం ఒక ఎకరం మాత్రమే శ్మశానికి మిగిల్చారని, ప్రభుత్వ భూములను ఆక్రమించడమే కాకుండా తన అనుచరులు, కుటుంబ సభ్యుల పేర్లతో వందల ఎకరాలు కబ్జా చేశారని, ఆధారాలతో సహా నిరూపించామని, త్వరలోనే భూములపై విచారణ కొనసాగుతుందన్నారు. తాను ప్రభుత్వ భూమిని ఆక్రమించానన్న విమర్శల్లో వాస్తవం లేదని, ఒక్క సెంటు ప్రభుత్వ భూమి తన భూమిలో ఉన్నా మొత్తం వదులుకుంటానని చెప్పినట్లు గుర్తు చేశారు. నారా లోకేశ్, చంద్రబాబు ఆదేశాల మేరకు గ్రామాల్లో అలజడులు సృష్టించేందుకు చూస్తున్నారని, ఎన్ని కేసులు ఉంటే వారిని గుర్తించి పదవులు ఇస్తామంటున్న లోకేశ్ అమాయకులైన యువతను బలి చేసేందుకు సిద్ధమయ్యాడని, తమ స్వార్థ రాజకీయాల కోసం ఎంతకైనా దిగజారుతున్నాడన్నారు. తాను ప్రభుత్వ భూములు ఆక్రమించి బ్యాంక్‌లో తనఖా పెట్టానని అసత్య ప్రచారాలు చేసిన వారిపై చట్టప్రకారంగా చర్యలు చేపడతామన్నారు. అధికార దాహం కోసం యువతను రెచ్చగొట్టి కేసుల్లో ఇరికించాలని చూస్తున్నారని, తల్లిదండ్రులు సరైన ఆలోచన చేసి టీడీపీ కల్లబొల్లి మాటలు నమ్మవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు, సర్పంచ్ కోపెల దేవరాజ్, పార్టీ సీనియర్ నాయకులు గోనుగుంట్ల వెంకట హనుమయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

పలుచోట్ల నా భూమి–నా దేశం కార్యక్రమం



బొల్లాపల్లిలో మొక్కలు నాటుతున్న అధికారులు



నూజెండ్లలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు



కొత్తలూరులో మొక్క నాటుతున్న డీఎల్‌డీవో

వినుకొండ (నూజెండ్ల): స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు నూజెండ్ల మండలంలోని ఉప్పలపాడు పంచాయతీలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నా భూమి-నా దేశం కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాలలో 75 కొబ్బరి మొక్కలు నాటడం, అమరవీరులకు వందనం, తీరంగా మార్చ్, గ్రామంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం కార్యక్రమం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడం జయరామి రెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల చిన్న బ్బాయి యాదవ్, మండలం వైఎస్సార్ సీపీ కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: మండల కేంద్రంలో నాదేశం-నామట్టి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం జెండా ఆవిష్కరించి దేశ ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శిఖా జ్యోత్స్న, ఇన్‌చార్జి తహసీల్దార్ వి. సుధాకర్ శర్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీ బాషా, ఎస్సై జి. రవికృష్ణ, ఎఫ్‌బీఓ రామకృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురం మండలంలో...

శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు, పోట్లూరు,శానంపూడి, ముండ్రువారిపాలెం గ్రామ పంచాయతీల్లో ఆజాదికా అమృత్ మహోత్సవం కార్యక్రమం ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సారథ్యంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎల్‌డీవో యం.వెంకటరెడ్డి పాల్గొని నాభూమి-నాదేశం శిలఫలకాలు ఆవిష్కరణ చేసి తదుపరి మన ప్రాణ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కొత్తలూరులో మొక్కలు నాటారు.

ఎన్ఎస్‌పీకి మంత్రి రజిని అభినందనలు

చిలకలూరిపేట: ఎన్ఎస్‌పీ ఇంజినీరింగ్ అధికారులను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అభినందించారు. బుధవారం పసుమర్రు రక్షిత మంచినీటి పథకం ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎన్ఎస్‌పీ కెనాల్స్ ఎస్ఈ వరలక్ష్మి, ఈఈ మల్లిఖార్జున, డీఈ ఉమాశంకర్‌లకు మంత్రి అభినందనలు తెలిపారు. వేసవి ఎద్దడి కారణంగా చిలకలూరిపేట నియోజకవర్గంలోని మంచినీటి చెరువులు అడుగంటిన నేపథ్యంలో జులై 24వ తేదీ నుంచి ప్రత్యేక అనుమతితో నీటిని విడుదల చేశారు. ఈ సమయంలో సమర్థవంతమైన ప్రణాళికతో నియోజకవర్గంలోని మంచినీటి చెరువులను నింపటం పట్ల ప్రశంసించారు. ఇదే విషయాన్ని ఇరిగేషన్ కార్యదర్శి శశిభూషణ్‌కు మంత్రి ఫోన్ చేసి తెలిపారు.

రెండో రోజూ నామినేషన్లు నిల్

నేటితో ముగియనున్న గడువు

నాదెండ్ల: ఇర్లపాడు, అమీన్‌సాహెబ్‌పాలెం, ఎండుగుంపాలెం గ్రామాల్లో వార్డు మెంబర్ల ఉప ఎన్నిక నేపథ్యంలో రెండో రోజు బుధవారం నామినేషన్లు దాఖలు కాలేదు. గురువారం సాయంత్రం 5 గంటలతో గడువు ముగియనుంది. మండలంలోని ఇర్లపాడు గ్రామంలో వార్డు నెం.6 (ఎస్సీ రిజర్వు), అమీన్ సాహెబ్‌పాలెం వార్డు నెం.4 (ఎస్సీ రిజర్వు), ఎండుగుంపాలెం వార్డు నెం.5 (ఎస్టీ రిజర్వు) స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 14 సాయంత్రం నామినేషన్ల విత్‌డ్రా, అదేరోజు సాయంత్రం 5 గంటలకు తుది జాబితా ప్రకటించనున్నారు. 19 ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ ఎన్నికలు నిర్వహించనున్నారు.

సామాజిక సేవతోనే ప్రజల్లో గుర్తింపు

గుంటూరు ఎడ్యుకేషన్: సామాజిక సేవతోనూ ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని, కులమతాలకు అతీతంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్న నారాయణ అభినందనీయులని వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో బుధవారం ఈపూరు మండలం అంగలూరుకు చెందిన నర్రా నారాయణ 50వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలపై గ్రామస్తులు ఆయనకు ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా 46వ డివిజన్ కార్పొరేటర్ నూకవరపు బాలాజీ మాట్లాడుతూ తమ డివిజన్‌లో పేద కుటుంబాలకు ఆర్థికంగా సహాయం చేయడంతో పాటు పేద విద్యార్థుల చదువులకు నారాయణ గుప్తదానాలు అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా సూరె విఘ్నేశ్వరరావు, నర్రా రామకృష్ణ, నర్సయ్య, శంకర్, శ్రీనివాస్, చందు, జీవీఆర్ శ్రీదేవితో పాటు నగరానికి చెందిన వివిధ రంగాల ప్రముఖులు నారాయణ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

రహదారులు ఆక్రమిస్తే కఠిన చర్యలు

నరసరావుపేట టౌన్: రోడ్డు అక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ కె.వి.మహేష్ హెచ్చరించారు. బుధవారం మున్సిపల్, పోలీస్ శాఖలు సంయుక్త ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించారు. హర్డ్ జూనియర్ కళాశాల ప్రహరీ ప్రక్కన రోడ్డు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. దీంతో పాటు మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్ దుకాణదారులు రోడ్డును ఆక్రమించి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యగా మారింది. దీనిపై దళిత సంఘాలు, స్థానికులు ఫిర్యాదులు చేయడంతో స్పందించిన అధికారులు ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టారు. పట్టణ ప్రణాళికా విభాగం అధికారి మోహన్‌రావు, టూటౌన్ సీఐ వీరేంద్రబాబు ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీ సహాయంతో హర్డ్ కళాశాల వద్ద అక్రమంగా నిర్మించిన ఇళ్లు, షెడ్‌లను తొలగించారు. అదే విధంగా మార్కెట్ యార్డు కాంప్లెక్స్ వద్ద ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు నిర్వహిస్తూ ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించవద్దన్నారు.

న్యాయవాదుల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

వినుకొండ(నూజెండ్ల): ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 12,13 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్. వీరాంజనేయచౌదరి కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభల్లో న్యాయపరమైన విషయాలు, న్యాయవాద వృత్తిలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, దేశంలో రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు సీహెచ్.ఎల్.ఎన్.మూర్తి, జిల్లా అధ్యక్షులు సయ్యద్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సలీం, జిల్లా ఉపాధ్యక్షులు శేషగిరిరావు పాల్గొన్నారు.

పంచాయతీ పదవులకు నామినేషన్లు

రొంపిచర్ల: మండలంలోని ఐదు గ్రామాల్లో పంచాయతీ వార్డు మెంబర్లకు, ఒక సర్పంచ్ పదవికి జరుగుతున్న ఎన్నికలకు సంబంధించి తొలి రోజు నలుగురు నామినేషన్లు దాఖలు చేశారని ఎంపీడీవో మాధ్యుబాబు బుధవారం తెలిపారు. చిరుమెళ్ల ఐదో వార్డు మెంబరు పదవికి పాలెపోగు పెదబాలనాగేశ్వరరావు నామినేషన్ దాఖలు చేయగా మాచవరంలోని 12వ వార్డుకు కందుల వెంకటపెద్దిరెడ్డి, విప్పర్లపల్లిలోని ఒకటో వార్డుకు పొందుగల చెంచిరెడ్డి, మునుమాక గ్రామంలోని మూడోవార్డుకు వేల్పుల సత్యవతి నామినేషన్ దాఖలు చేశారు. అలాగే రామిరెడ్డిపాలెం గ్రామసర్పంచ్ పదవికి ఒక నామినేషన్ కూడా దాఖలు కాలేదన్నారు. కాగా నామినేషన్లు వేసేందుకు గురువారం చివరిరోజు.

వ్యక్తి మృతి

నాదెండ్ల: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి పురుగుమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్ద ఎస్సీ కాలనీకి చెందిన కొరివి కోటయ్య (57) వ్యవసాయ కూలి పనులు చేసుకుని జీవిస్తుంటాడు. 7న పురుగు మందు కలిపి తాగి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తర లించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి స్థల పరిశీలన

నాబార్డు ప్రతినిధులతో కలసి పరిశీలించిన ఎమ్మెల్యే బొల్లా



స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం రెవెన్యూ, ఎన్ఎస్‌పీ, నాబార్డు ప్రతినిధులతో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్‌పీ కాలనీలో 5 ఎకరాల విస్తీర్ణంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి మార్గం సుగమమైందని, పల్నాడు జిల్లాలో చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లో ఆస్పత్రి నిర్మాణాలతో పాటు ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అన్ని అనుమతులు మంజూరు చేసిందని, త్వరలోనే ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. నాబార్డు ఆర్థిక సాయంతో ఆస్పత్రి నిర్మాణం చేసేందుకు బ్యాంక్ ప్రతినిధుల బృందం కూడా స్థలాన్ని పరిశీలించారు. పట్టణంలోని పాత ఆస్పత్రి భవనంలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రానున్న రోజుల్లో వినుకొండ నియోకజవర్గ ప్రజలకు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి తెస్తామన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో ఇప్పటికే పట్టణంలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లతో పాటు ప్రభుత్వ వైద్యశాలకు అనుగుణంగా 100 పడకల ఆసుపత్రి నిర్మిస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో వినుకొండ పట్టణాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, మండల కన్వీనర్ దండు చెన్నయ్య, వార్డు కౌన్సిలర్ షకీలా దస్తగిరి, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎన్ఎస్‌పీ డీఈ నందిగం రాజన్‌లతో పాటు నాబార్డు ప్రతినిధులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తికావాలి

నూజెండ్ల మండల ప్రత్యేకాధికారి, వినుకొండ ఏడీఏ బోయపాటి రవిబాబు



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న రవిబాబు

వినుకొండ(నూజెండ్ల): ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సంబంధిత అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని నూజెండ్ల మండల ప్రత్యేకాధికారి, వినుకొండ ఏడీఏ బోయపాటి రవిబాబు అన్నారు. నూజెండ్ల మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలు, విలేజ్ క్లీనిక్, జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం, పాఠశాలలో నాడు-నేడు పనులను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం గ్రామసచివాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, గర్భిణుల వివరాలు, స్కూల్‌లో బలహీనంగా, తక్కువ బరువు ఉన్న పిల్లల వివరాలను తప్పనిసరిగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో నమోదు చేసి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గ్రామంలో జరుగుతున్న ఫామిలీ డాక్టర్ కార్యక్రమంపై ఆరా తీశారు. అనంతరం ఎంపీపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో ఏఈవో ఎల్.ఎలీషా, పంచాయతీ కార్యదర్శి చెన్నారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

బొల్లాపల్లి: సస్టెయిన్‌బుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌లో భాగంగా మండలంలోని బొల్లాపల్లి, వెల్లటూరు గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం అధికారులు సందర్శించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి రుచి చూశారు. నాడు-నేడులో నిర్మాణంలో ఉన్న బిల్డింగ్స్‌ను, పనులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ నాడు-నేడులో పలు పాఠశాలల్లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. మధ్యాహ్న భోజనం విద్యార్థులకు నాణ్యతతో పాటు రుచికరంగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ప్రీ స్కూల్ యాక్టివిటీస్ నిర్వహించి వారికి బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వి.సుధాకర్‌శర్మ, ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీ బాషా, పీఆర్ ఏఈ అల్లాభక్షు, ఎంఈఓ 2 కె. పార్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.శ్రీదేవి పాల్గొన్నారు.

ఎండుగుంపాలెంలో గ్రామోదయం

నాదెండ్ల: మండలంలోని ఎండుగుపాలెం గ్రామంలో బుధవారం అధికారులు గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామాన్ని సందర్శించారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో విడత మనబడి నాడు నేడు పనులు పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యత పరిశీలించి పథకం నిర్వాహకులకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా సచివాలయ సిబ్బంది పనిచేయాలని సూచించారు.

చర్మకారుల అభ్యున్నతికి సహకరించాలి

శావల్యాపురం:మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో చర్మకార సేవ సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో చర్మకారులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు మండల అధ్యక్షులు కాకాని వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు మల్లావరపు రవికుమార్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో మాదిగల అభ్యున్నతికి సంక్షేమానికి ఉపాధి కల్పనకు రూ. 65 కోట్లు కేటాయించినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పత్రికల ద్వారా సమాచారం ఇవ్వటం మంచి శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ చర్మకారుల అధ్యక్షులు జుంజు యేహేను, రావినూతల శ్యాంసోన్, ఏసోబు, గూడూరి రోశమ్మ, గండి నాగేశ్వరరావు,గొల్లయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సేవలు అందించాలి

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో స్వయంసహాయక మహిళా సభ్యులకు అవగాహన కార్యక్రమం వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయం అధికారులు బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీయం జి.వాసుబాబు పాల్గొని మాట్లాడుతూ స్వయం సహాయక మహిళా సభ్యులు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, జగనన్న తోడు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి ప్రభుత్వం అందించే రాయితీలు పొందాలన్నారు. సర్పంచ్ జ్యోతి, సీసీ ఖాజావలీ, వీవోఎలు యానిమేటర్లు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారిణికి ట్రిపుల్‌ఐటీ సీటు

నరసరావుపేట రూరల్: మండలంలోని లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ స్కూలుకు చెందిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ ఖోఖో టీం క్రీడాకారిణి, పదో తరగతి విద్యార్థిని ఎం.జ్ఞానశివపార్వతి నూజివీడు ట్రిబుల్ ఐటీలో సీటు సాధించారు. ఆ విద్యార్థినికి స్పోర్ట్స్ కోటాలో సీటు లభించింది. శివపార్వతికి పదో తరగతి పరీక్షల్లో 535 మార్కులు కూడా సాధించింది. ఈ మేరకు ప్రతిభ కల్గిన ఆ విద్యార్థినిని ఆజాదీకా మహోత్సవ్‌లో బాగంగా లింగంగుంట్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆ విద్యార్థినికి దుశ్శాలువ కప్పి సత్కరించి అభినందించారు. అలాగే పీడీ ఝాన్సీ రాణి, క్రీడాకారిణి శివపార్వతీని జిల్లా ఖోఖో అసోసియేషన్ తరపున ప్రతినిధులు అభినందనలు తెలియ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్వీ రమణా నాయక్, పొన్నపాటి ఈశ్వరరెడ్డి, మాజీ ఉపసర్పంచ పొన్నపాటి విజయకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.